ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 7 మే 2025

కదిరి-రాయచోటి రోడ్డుకు

మహార్దశ

నాడు నరకం-నేడు సుఖ ప్రయాణం

ఐదేళ్లు మట్టి కూడా వేయని వైసీపీ పాలకులు

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కందికుంట



రూపురేఖలు మారిన కదిరి-రాయచోటి రోడ్డు



ధనియానిచెరువు వద్ద ఏర్పడిన గుంత (ఫైల్)

నంబులపూలకుంట, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని కదిరి-రాయచోటి రోడ్డుకు మహర్దశ కలిగింది. వైసీపీ పాలనలో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఎన్నికల ప్రచార సమయంలో కదిరి-రాయచోటి రోడ్డు మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మాట ఇచ్చిన టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్.. ఎమ్మెల్యే అయిన వెంటనే దీనిపై దృష్టిసారించి మాట నిలబెట్టుకున్నారు. అధికారంలోకి రాగానే పనులు ప్రారంభించారు. పది నెలలలోపే రోడ్డు రూపురేఖలు మారాయి. 33కిలో మీటర్ల ప్రయాణం గతంలో గంటల కొద్ది పట్టేది. ప్రస్తుతం నిమిషాల వ్యవధిలో ప్రయాణం కొనసాగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గరుగుమిట్టను చీల్చి రోడ్డు..

కదిరి-నంబులపూలకుంట రహదారిలోని ధనియాన్ చెరువు సమీపంలో గరుగుమిట్ట వద్ద మలుపు ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు జరిగేవి. ప్రమాదాల విషయం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి మండల వాసులు తీసుకెళ్లారు. దీంతో ఆయన చొరవతో గరుగుమిట్టను మధ్యకు చీల్చి రోడ్డు వేయడానికి సన్నాహలు జరుగుతున్నాయి. నెలల తరబడి ఈగుట్టను చీల్చడానికి యంత్రాలు పనిచే శాయి. పనులు వేగవంతంగా జరుగుతుండడంతో త్వరలోనే ఈరోడ్డు సుఖాంతమవుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.34 కోట్లతో పనులు

కదిరి-రాయచోటి రోడ్డు.. గాండ్లపెంట, ఎన్పీకుంట మండలాల మీదుగా అన్నమయ్యజిల్లా సరిహద్దు వరకు 33 కిలోమీటర్లు దూరం ఉంది. రూ.34 కోట్ల వ్యయంతో 19 కిలోమీటర్ల రోడ్డు పనులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 16 కిలోమీటర్లు పూర్తయింది. ఎన్పీకుంట మండల కేంద్రానికి కిలోమీటరు.. మండల కేంద్రం నుంచి అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు కలిసి మూడు కిలోమీటర్లు మాత్రమే పనులు చేయాల్సి ఉంది.

నాడు నరకం.. నేడు సుఖ ప్రయాణం

వైసీపీ పాలనలో కదిరి - రాయచోటి రోడ్డును ఏమాత్రం పట్టించుకోలేదు. ఆ సమయంలో కురిసిన వర్షాలకు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా గుంతలు పడి తారు కనిపించకుండా పోయింది. కదిరి నుంచి అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు 33 కిలో మీటర్ల ప్రయాణం నరకంగా సాగేది. చాలా మంది మండలంలోని పెడబల్లి మీదుగా కొక్కంటిక్రాస్‌కు వెళ్లి గమ్యాలకు చేరుకునే వారు.

ద్విచక్ర వాహనదారులు కంకర గుంతల రోడ్డులో పడి ప్రమాదాలబారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి కిందపడిన సంఘటనలు ఉన్నాయి. పలుమార్లు పత్రికల్లో వార్తలు వచ్చినా స్పందన లేదు. కనీసం గుంతలకు మట్టి కూడా వేయలేదు. వైసీపీ పాలనలో పనులు మొదలు పెట్టి కొద్ది దూరం కంకర పరచి వదిలేశారు. కంకర రోడ్డుపై ప్రయాణం మరింత నరకప్రాయంగా ఉండేదని గతంలో ప్రయాణికులు వాపోతుండేవారు.

జూన్ 15కు పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు రోడ్డు పనులను వేగవంతం చేస్తున్నాం. జూన్ 15నాటికి మొత్తం పనులు పూర్తి చేస్తాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి మరింత జాగ్రత్తగా పనులు చేస్తున్నాం.

- కృష్ణమోహన్‌నాయుడు, కాంట్రాక్టర్

అర గంటలోనే ప్రయాణం



గతంలో గంటల వ్యవధి పట్టే కదిరి-ఎన్పీకుంట ప్రయాణం.. ప్రస్తుతం 30 నిమిషాలే పడుతోంది. ప్రయాణికులు, వాహనదారులు ఆనందంగా ప్రయాణిస్తున్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. మిగిలిన రోడ్డు కూడా త్వరగా పూర్తయితే అన్నమయ్య జిల్లా వాసులు సత్యసాయి జిల్లాకు సులువుగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది.

-దండే రవిశంకర్, నంబులపూలకుంట

పోలీసుల దూకుడు

- కుంటిమద్ది కేసు దర్యాప్తు వేగవంతం
- నిందితుల సంఖ్య వందకు పైగానే..?
- ఇప్పటి వరకూ 10 మంది అరెస్టు
- తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి వాట్సాప్‌లో నోటీసులు
- పైలెట్ అనిల్ కుమార్‌కు మూడో నోటీసు

7



గతనెల 8న హెలిప్యాడ్ వద్ద జగన్‌ను చుట్టేసిన వైసీపీ శ్రేణులు

గాలికి ఏడేళ్ల జైలు

ఓఎంసీ ఖనిజ దోపిడీ నిర్ధారణ

తీర్పునిచ్చిన సీబీఐ ప్రత్యేక కోర్టు



ఓబుళాపురం మైనింగ్ కంపెనీ ఖనిజ దోపిడీ నిర్ధారణ అయింది. కేసులో తొలి ముగ్గురు ప్రధాన ముద్దాయిలు బీవీ శ్రీనివాస్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, అప్పటి మైన్స్ అండ్ జియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఏడో ముద్దాయి, గాలి జనార్దన్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు ఎం.అలీఖాన్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించింది. ఏ-4గా ఉన్న ఓఎంసీకి రూ.లక్ష జరిమానా విధించింది. (మెయిన్‌లో...)

సత్యసాయి జయంతి.. రాష్ట్ర పండుగ

జీఓ జారీ చేసిన ప్రభుత్వం



పుట్టపర్తి రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. సత్యసాయి శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించాలని అసెంబ్లీలో కూటమి ప్రభుత్వాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది నవంబరు 23న సత్యసాయి శత జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఇప్పటికే ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఏర్పాట్లు చేస్తున్నాయి. శత జయంతి వేడుకలకు దేశ విదేశాలకు చెందిన అనేక మంది ప్రముఖులు పుట్టపర్తికి విచ్చేయనున్నారు. పది లక్షలకు పైగా సత్యసాయి భక్తులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉంది. సత్యసాయి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



ఈశ్వరమ్మ సమాధి వద్ద పూజలు చేస్తున్న ఆర్‌జే రత్నాకర్ దంపతులు

ఘనంగా ఈశ్వరమ్మ డే

200 కుట్టు మిషన్లు, 100 టూల్‌కిట్లు పంపిణీ

పుట్టపర్తి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రేమమూర్తి, ఆధ్యాత్మిక గురువు సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సమాధి రోడ్డులోని సత్యసాయి తల్లిదండ్రులు పెదవెంకమరాజు, ఈశ్వరమ్మ సమాధులను ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ దంపతులు ఈశ్వరమ్మ సమాధి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. విద్యార్థులు వేదపఠనం, భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం శ్రీసత్యసాయి గ్లోబల్ చైర్మన్ చక్రవర్తి, రత్నాకర్‌లు భక్తులకు నారాయణసేవ అందించారు. సాయికుల్వంతు సభామండపంలో శ్రీకాకుళం సేవాదళ్‌కు 200 కుట్టు మిషన్లు, 100 టూల్‌కిట్లు ఆర్‌జేరత్నాకర్ పంపిణీ చేశారు. ఏపీ సేవాసంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో కిట్లను పంపిణీ చేశారు. సాయంత్రం విశ్వజనని, ఈశ్వరమ్మ పేరిట సాయియూత్ డ్యాన్స్ డ్రామాను ప్రదర్శించారు. ప్రపంచానికి ఆధ్యాత్మిక గురువు, విద్య, వైద్య ప్రదాత సత్యసాయిబాబాకు జన్మనిచ్చిన ప్రేమమూర్తి ఈశ్వరమ్మ నాటిక ప్రదర్శించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

కోట గోడలపై శాసనాలను కాపాడండి

చరిత్రకారుడు మైనాస్వామి



పెనుకొండ చరిత్రను తెలిపే కోటగోడ దెబ్బతిన్న దృశ్యం

పెనుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ కోటకు అవసరమైన చోట మరమ్మతులు తక్షణం చేసి, వాటిపై చెక్కిన శాసనాలను కాపాడాలని చరిత్రకారుడు మైనాస్వామి కోరారు. కోటగోడలపై గల శాసనాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలుతున్న కోటగోడలకు మరమ్మతులు చేయడమేకాక కనుమరుగవుతున్న శాసనాలను పరిరక్షించాలని పురావస్తుశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పెనుకొండ కోట నిర్మాణ విశేషాలను తెలుపుతున్న 1వ బుక్కరాయల శాసనం ఉన్న చోట కోటగోడ దెబ్బతిందన్నారు. కోట నిర్మాణ శాసనం ఉత్తర ప్రవేశ ద్వారం లోపలివైపున ఉందన్నారు. పెనుకొండ చరిత్రను తెలుపుతున్న అత్యంత ముఖ్యమైన శాసనం చెత్తకుప్పల్లో కలిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీవారు చెత్తను శాసనం ఉన్న రాయి ముందే వేస్తున్నారని, తక్షణం ఈ ప్రాంతాన్ని శుభ్రం చేసి, కంచెను ఏర్పాటు చేసి, చరిత్రను తెలిపేవిధంగా సూచిక ఫలకాన్ని అమర్చాలని కోరారు. భారత పురావస్తుశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులలో ఆయన మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలో జూన్ 12నాటికి పదిలక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసే బాధ్యతను సమీక్షించాలన్నారు. జిల్లాలో 8 మండలాలు ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి చేయాలని అధికారులును ఆదేశించారు. సమావేశంలో జిల్లా హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీఈలు శంకర్‌లాల్‌నాయక్, శ్రీనివాసు, శివాకుమార్‌నాయక్, వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ: డీఆర్వో

పుట్టపర్తిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో విజయసారథి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ సప్లిమెంటర్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో డీఆర్వో మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కేంద్రాల నిర్వాహణలో భాగంగా ఫ్లయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. కార్యక్రమంలో డీఐఈడీ సయ్యద్‌మౌలా, డీఎస్పీ విజయ్‌కుమార్, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, కార్మిక శాఖాధికారి సూర్యనారాయణ, రవాణా శాఖ డీఎం ఇనయతుల్లా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిన్నారిని కబళించిన అతిసార

- జీజీహట్టిలో ప్రబలిన మహమ్మారి
- 24 మందికి అస్వస్థత.. ఆస్పత్రుల్లో చికిత్స



అతిసారపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అమూల్య(ఫైల్)



అతిసార బాధితులకు సెలెన్ ఎక్కిస్తున్న దృశ్యం

రొళ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీజీహట్టి గ్రామంలో అతిసార వ్యాధితో అమూల్య(10) మంగళవారం మృతి చెందింది. చిన్నారి అమూల్య సోమవారం మధ్యాహ్నం నుంచి వాంతులు, విరేచనాలంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు రొళ్లలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం మంగళవారం ఉదయం శిర పట్టణంలోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా గ్రామంలో అతిసార ప్రబలడంతో 24మంది ఆస్పత్రుల పాలయ్యారు. వాంతులు, విరేచనాలు సోమవారం నుంచి అధికం కావడంతో రొళ్ల, మధుగిరి, శిర, మడకశిర ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీపీఓ సమత, డీఎల్‌పీఓ శివ నారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, తహసీల్దార్ షెక్షావలి, ఎంపీడీఓ రామారావు, వైద్యాధికారులు సౌందర్య, శివానందప్ప గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. పరిశుభ్రత, ఆహార నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య చికిత్సలు అందించారు. గ్రామస్థులు తాగునీటికి ఉపయోగిస్తున్న బోరుబావుల నుంచి శాంపిళ్లు సేకరించారు. నాలుగు రోజుల కిందట గ్రామంలో నాలుగు పెళ్లిళ్లు, గ్రామదేవత ఉత్సవం నిర్వహించారు. ఈక్రమంలోనే అతిసార సోకిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సత్వరం నివారణ చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

రొళ్ల మండలలోని జీజీహట్టి గ్రామంలో అతిసార నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మంగళవారం ఆదేశించారు. జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ పది రోజులపాటు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి ప్రజలకు మెరుగైన చికిత్సను అందించాలన్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే ప్రజలకు అందించాలని సూచించారు. సత్వరమే తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించి, పైప్‌లైన్‌లలో ఎక్కడా మురుగునీరు చేరడానికి అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధి అధికారితో మాట్లాడుతూ అవసరమైన మేరకు నూతన తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయించి ప్రజలకు పరిశుద్ధ నీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్‌కు డిమోషన్

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మళ్లీ కదిరికే బదిలీ



ప్రహ్లాద

పుట్టపర్తి టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్ ప్రహ్లాదకు డిమోషన్ ఇచ్చి కదిరి మునిసిపాలిటీకి బదిలీ చేశారు. ఈమేరకు మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈయన కదిరి మునిసిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించేవారు. గత ఏడాది నవంబరులో ఉద్యోగోన్నతి కల్పించి పుట్టపర్తి మునిసిపాలిటీ కమిషనర్‌గా నియమించారు. అయితే ఈయనపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో మునిసిపల్ ఉన్నతాధికారులు ఆయనకు డిమోషన్ ఇచ్చి తిరిగి కదిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

తరతరాల సంప్రదాయం.. బండిశూల ఉత్సవం..!

6



సర్వభూపాల, సింహ వాహనాలపై చెన్నకేశవుడు

ధర్మవరం, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఘనంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారు సర్వభూపాల, సాయంత్రం సింహ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చాడు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. చెన్నకేశవుడి ఉత్సవ విగ్రహాలను అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాశ్ ప్రత్యేకంగా అలంకరించి, పట్టణ వీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య బృందం అన్నమయ్యసేవా సంకీర్తనలను ఆలపించారు. బుధవారం ఉదయం కల్పవృక్షంపై, సాయంత్రం హనుమద్వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



సర్వభూపాల వాహనంపై ఆశీనులైన చెన్నకేశవుడు, సింహవాహనంపై చెన్నకేశవుడు



ఎక్స్‌కవేటర్‌తో పైపులైన్ పనులు చేస్తున్న దృశ్యం

తీరనున్న దాహం..

రూ.11.56 కోట్లతో తాగునీటి పైపులైన్ పనులు

- 90 శాతం పూర్తి
- ఏడువేల కుటుంబాలకు ప్రయోజనం

విడపనకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు గ్రామాలకు చెందిన 7 వేల మంది దాహం తీర్చే తాగునీటి పైపులైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. మండలంలోని హావళిగి గ్రామంలోగల పంపుహౌస్ నుంచి ఆరు గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆరు గ్రామాలకు తాగునీరు సరిగా అందక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి సమస్యపై అప్పటి ప్రజాప్రతినిధులను ఖాళీ బిందెలతో నిలదీశారు. అయినా పట్టించుకున్న పాపాన పోలేదు. పయ్యావుల కేశవ్ ఎన్నికల ప్రచారంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలో నీటి సమస్య పరిష్కారానికి రూ.11.56 కోట్ల నిధులు కేటాయించారు. వెంటనే పనులు ప్రారంభించారు. 90 శాతం మేర పూర్తయ్యాయి కూడా.

బొమ్మనహాళ్ మండలంలోని బొల్లనగుడ్డం వద్ద హగరి నదిలో బావి తవ్వి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా మండలంలోని హావళిగి పంపుహౌస్‌కు నీరు సరఫరా చేస్తున్నారు. దాదాపు 10.5 కిలో మీటర్లు పైపులైన్ ఉంది. అక్కడి నుంచి మండలంలోని హావళిగి, కరకముక్కల, పాల్తూరు, గాజుల మల్లాపురం, చీకలగురికి, ఉండబండ గ్రామాల్లోని ఏడు వేల కుటుంబాలకు చెందిన

28వేల మందికి తీరనున్న కష్టాలు

28 వేల జనాభాకు నీరు సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా నీరు ఆయా గ్రామాల ప్రజలకు చాలట్లేదు. 24 గంటలూ మోటార్లు పెట్టి నీరు తోడినా వారినికోసారి సరఫరా మాత్రమే నీరు అందుతోంది. వేసవిలో ఆయాగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపారు. పైపులైన్ పనులకు రూ.11.56 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో బొల్లనగుడ్డం నుంచి మరో భారీ పైపులైన్ నిర్మాణం చేపట్టారు. తద్వారా హావళిగి పంపుహౌస్‌కు నీరు తీసుకొస్తారు. అక్కడి నుంచి గ్రామాలకు సరఫరా చేస్తారు. హావళిగి పంపుహౌస్ పాతది కావడంతో కొత్తది నిర్మించనున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ నీరు సరఫరా చేసేలా కొత్తగా పైపులైన్లు వేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇంకో 600 మీటర్లు చేయాల్సి ఉంది. అవి కూడా పూర్తయితే ఆయా గ్రామాల్లో తాగునీటికి కొరత ఉండదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పాత పైపులు



పంపుహౌస్ వద్ద సిద్ధంగా ఉన్న పైపులు

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం



బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డం నుంచి హావళిగి గ్రామం వరకూ 10.5 కిలోమీటర్ల దూరం పైపులైన్ పనులు పూర్తిచేశాం. ఇంకో 600 మీటర్లు పెండింగ్‌లో ఉంది. అదికూడా త్వరలోనే పూర్తిచేస్తాం. దీంతో ఆరు గ్రామాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

-ముజామిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, విడపనకల్లు

ఏరియా ఆస్పత్రిలో

ఎక్స్‌పైర్డ్ మందులు..!

గుంతకల్లు వైద్యశాలలో రోగుల ఆరోగ్యంతో చెలగాటం



కాలంచెల్లిన పోవిడన్ అయోడిన్ ఆయింట్‌మెంట్

కాలంచెల్లిన ఆయింట్ మెంట్ (వృత్తంలో ఎక్స్‌పైర్ తేదీ)





గుంతకల్లు ఏరియా ఆస్పత్రి

గుంతకల్లు, మే6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కాలంచెల్లిన మందులతో రోగుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. విషయం తెలియక ఆస్పత్రికి వచ్చే రోగులు వాటిని గుడ్డిగా తీసుకెళ్తున్నారు. ఆస్పత్రికి సరఫరా అయ్యే మందులు నెలలో కాలంచెల్లే పరిస్థితిలో ఉంటుండటంతో వాటిని వాడేలోపే గడువు తీరిపోతున్నాయి. ఆస్పత్రికి వైద్యులకు విషయం తెలిసినా నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. ఎక్స్‌పైరీ మందులను వాడేది లేదంటూ కట్టుకట్టే సిబ్బంది.. ఫార్మసీ స్టాకిస్టుకు తెగేసి చెబుతున్నా.. 'ఎక్స్‌టర్నల్ యూజ్ కదా.. ఏమీకాదులే' అంటూ సర్దిచెబుతున్నారట. మందుల ఎక్స్‌పైరీ వివరాలను తెలిపి వైద్యులకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాల్సి ఉండగా, ఆ పని జరగడంలేదు. రోగులు తినాల్సిన మందులు కూడా రేపో.. మాపో ఎక్స్‌పైరీ అయ్యే స్థితిలోనే ఉంటుండటం గమనార్హం.

కాలంచెల్లి నాలుగు నెలలు..

గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి ఎక్స్‌పైరీ డేట్ దాడిన మందులు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏయే మందులు కావాలో ఇండెంటు పెడితే అనంతపురంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి ఆ మేరకు నెల, రెండు నెలలకు సరిపడా పంపుతారు. అలా గుంతకల్లు ఏరియా ఆస్పత్రికి వచ్చిన మందుల్లో కొన్ని ఆయింట్‌మెంట్లు కాలంచెల్లి నాలుగు నెలలౌతోంది. వాటిని ఇంకా వాడుతూనే ఉన్నారు. రోగులకు ఇచ్చిపంపుతున్నారు. పోవిడన్ అయోడైన్ అనే ఆయింట్‌మెంట్ 2023 జనవరిలో తయారై, 2024 డిసెంబరు ఎక్స్‌పైరీ తేదీ కలిగి ఉంది. ఆ ఆయింట్‌మెంట్ ఆస్పత్రికి వచ్చి మూడు నెలలు మాత్రమే అయ్యింది. దానిని రక్తగాయాలు, పుండ్ల కట్టుకు వినియోగిస్తారు. ఆస్పత్రిలో కట్టుకట్టే సిబ్బంది ఆయింట్‌మెంట్ ఎక్స్‌పైరీ తేదీ దాటిన సంగతిని గుర్తించి ఫార్మసీ స్టోర్ ఇన్‌చార్జి, వైద్యుల దృష్టికి తీసుకెళ్లారు. 'ఎక్స్‌ర్నల్ యూజ్ కనుక వాడండి, పర్వాలేదంటూ..' వాటినే ఇస్తున్నారు. అలాగే క్లోట్రిమాజోల్ ఆయింట్‌మెంట్‌పై 2023 సంవత్సరం తేదీని వేశారు. వైద్యులకు ఇచ్చే పలు మందులు మరో నెలలో కాలం చెల్లే స్థితిలో ఉండగా, మరికొన్ని ఎక్స్‌పైర్ తేదీని దాటాయి.

ఎందుకీ పరిస్థితి?

కాలం చెల్లడానికి కేవలం నెలా, రెండు నెలలు ఉండగా సెంట్రల్ స్టోర్ నుంచి గుంతకల్లుకు మందులు వచ్చాయని తెలుస్తోంది. వాటిని ఎక్స్‌పైరీలోపే వినియోగించాల్సిన బాధ్యత వైద్యులు, ఫార్మసీ స్టాకిస్టుపై ఉంటుంది. సాధారణంగా మందుల కాలం చెల్లే తేదీ దగ్గరపడుతున్న వాటి వివరాలను తెలుపుతూ వైద్యులకు ఫార్మసిస్టులు జాబితాను ఇవ్వాల్సి ఉంటుంది. గడువు పూర్తయ్యేలోగా వాటిని వినియోగించడమో, లేదంటే సెంట్రల్ స్టోర్‌కు వాపసు పంపడమో చెయాల్సి ఉంటుంది. కాగా గతంలో ఫార్మసీకి, స్టోర్‌కు రెగ్యులర్ ఉద్యోగులు ఉండేవారు. వారిస్థానంలో ఇప్పుడు కాంట్రాక్టు ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. ఎక్స్‌పైరీ మందుల విషయంగా గతంలో వైద్యులకు నోట్ వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకుండాపోయింది. ఫార్మసీలో నిర్లక్ష్యం కారణంగా మందులు మూలన పడుతున్నాయని ఆస్పత్రి సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎక్స్‌పైరీకి దగ్గరలో మందులు వస్తున్నాయి



కొన్ని మందులు ఎక్స్‌పైరీకి అతి దగ్గరలో ఉండగా ఆస్పత్రికి వస్తున్నాయి. వాటిని సకాలంలో వినియోగించుకునేలా స్టాకిస్టు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ఎక్స్‌పైరీకి దగ్గరలో ఉన్న మందుల వివరాలను వైద్యులకు ఇచ్చి వినియోగించేలా చూడాలి. నోటి ద్వారా తీసుకునే మందులేవీ ఎక్స్‌పైరీ కాలేదు. కాలం చెల్లితే రోగులకు ఇవ్వడం లేదు. ఆయింట్‌మెంట్ల విషయంగా తప్పక చర్యలు తీసుకుంటా. సెంట్రల్ స్టోర్‌కు నివేదిక పంపి, వేరే ఆయింట్‌మెంట్లను తెప్పిస్తాం.

-జయవర్ధన్ రెడ్డి, గుంతకల్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్



ఎక్స్‌పైర్ అయిన మందు డబ్బా

శరవేగంగా విస్తరణ పనులు

హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్



హంద్రీనీవా విస్తరణ పనులను జూన్ ఆఖరులోగా పూర్తి చేస్తామని ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించామని, శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఈ పనులను పరిశీలించేందుకు ఈ నెల 9న సీఎం చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో పనుల పురోగతిపై ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పనులు జరుగుతున్నాయి...?

ఎస్ఈ: హంద్రీనీవాలో ప్రస్తుతం కాలువ వెడల్పు, సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుడివైపున మాత్రమే కాలవను వెడల్పు చేస్తూవస్తున్నాం.

ప్రశ్న: లైనింగ్ పట్ల రైతుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. భూగర్భ జలాలు పెరగవని అంటున్నారు..

ఎస్ఈ: లైనింగ్ పనులతో సమస్యలు వస్తాయనేది అపోహ మాత్రమే. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. సిమెంట్ కాంక్రీట్ లైనింగ్‌తో భూగర్భ జలాలు తగ్గిపోతాయనేది అపోహ మాత్రమే. లైనింగ్ వల్ల చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

ప్రశ్న: నిధులు ఎంత కేటాయించారు....?

ఎస్ఈ: కాలువ 144 కి.మీ. నుంచి 216వ కి.మీ. వరకు మొత్తం 72 కి.మీ. కాలువ వెడల్పునకు రూ.400 కోట్లు కేటాయించారు. 216 కి.మీ. నుంచి 200 కి.మీ. వరకు మొత్తం 184 కి.మీ. లైనింగ్ కోసం రూ.936 కోట్లు మంజూరు చేశారు.

ప్రశ్న: పనులను ఎలా చేపడుతున్నారు...?

ఎస్ఈ: కాలువ వెడల్పు పనులు ఫేజ్-1 కింద ఒక ప్యాకేజీగా విభజించారు. ఫేజ్-2 కింద 8 ప్యాకేజీలుగా విభజించారు. అన్ని పనులు చాలావేగంగా జరుగుతున్నాయి.

ప్రశ్న: కాలువ సామర్థ్యాన్ని ఎంత పెంచుతున్నారు..? పటిష్టత ఎలా ఉంటుంది..?

ఎస్ఈ: లైనింగ్, వెడల్పుతో కాలువ మరింత పటిష్టం అవుతుంది. ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చే సామర్థ్యం ఉంది. పనులు పూర్తి అయితే 3,850 క్యూసెక్కుల నీటిని మల్యాల నుంచి తీసుకురావచ్చు.

ప్రశ్న: పనులను ఎప్పటికి పూర్తి చేస్తారు...?

ఎస్ఈ: పనులు ప్రారంభించిన నాటి నుంచి వంద రోజుల్లో పూర్తి చేయాలన్నది లక్ష్యం. 20 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కాలువ వెడల్పు, లైనింగ్ పనులను నిర్దేశించిన తేదీలోగా పూర్తి చేస్తాం. వచ్చే సీజన్‌లో మల్యాల వద్ద నుంచి కృష్ణా జలాలను తీసుకువస్తాం.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్

9న ఛాయపురం రానున్న

సీఎం చంద్రబాబు

చకచకా ఏర్పాట్లు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న జేసీ

ఉరవకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 9న వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. హెలీప్యాడ్ పనులు, గ్రామసభ వేదిక ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. హెలీప్యాడ్ పనులను ఆర్ అండ్‌బీ ఎస్ఈ నాగరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సీఎం పర్యటన నేపథ్యంలో వజ్రకరూరు మండలంలోని ఛాయాపురం గ్రామం వద్ద హెలీప్యాడ్, హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గ్రామసభ వద్ద ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జగదీష్‌తో కలిసి జేసీ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలీప్యాడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డీవో, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలను ఆదేశించారు. హంద్రీనీవా బ్రిడ్జి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఈఈకి సూచించారు. గ్రామసభ ఏర్పాటు కోసం తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాస్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కేశవనాయుడు, శ్రీనివాస్, డీపీవో నాగరాజు నాయుడు, జడ్పీసీఈవో రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజ్‌గోపాల్, డీఎల్‌డీవోలు లలితాబాయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తరతరాల సంప్రదాయం..

బండిశూల ఉత్సవం..

ఏడు కాండ్ల ఎద్దులతో రథోత్సవం

నేటి నుంచి ఐదు రోజులపాటు సంబరం

పామిడి, మే 6(ఆంధ్రజ్యోతి): బండిశూల (శూర బండి) ఉత్సవానికి జిల్లాలో ఎంతో ప్రత్యేకత ఉంది. మూడు గ్రామాలు కేంద్రంగా ఏడు కాండ్ల ఎద్దులతో ఐదు రోజుల పాటు సాగే వైభోగమిది. స్వయానా దేవతలే చేయించుకుంటున్న మహోత్సవం. పామిడి మండలంలోని రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తి-అనంతపురం గ్రామాల నడుమ ఏటా వైశాఖ మాసంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. జిల్లాలోని పలు మండలాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతారు.





బండిశూల రథోత్సవం (ఫైల్), రామరాజుపల్లిలో సుంకులమ్మ, ముత్యాలయ్య స్వాములు

వేడుక వెనుక విశ్వాసం

ఐదు రోజులపాటు సాగే బండిశూల ఉత్సవాలపై రామరాజుపల్లి ప్రజలు చెప్పే చరిత్ర వింటే ఆశ్చర్యం కలగక మానదు. పూర్వం రామరాజుపల్లికి చెందిన రజకులు గుత్తి-అనంతపురం వాగుకు వెళ్లి దుస్తులు ఉతుకుతూ జీవనం సాగించేవారు. ఒకరోజు గ్రామానికి చెందిన ఓ రజకుడు వాగుకు దుస్తులు ఉతికేందుకు వెళ్లగా నీరు కనిపించలేదు. దీంతో వెనుదిరిగి వస్తుండగా రెండు గాడిదలపై ఇద్దరు చిన్నారులు కూర్చుని ఉండడం గమనించాడు. ఆ చిన్నారులను ఎంత పలకరించినా పలకలేదట. దీంతో ఆ రజకుడు.. వారి చేతులు పట్టుకోగా.. వారు అదృశ్యమయ్యారు. ఇలా ఈ తంతు వారం రోజులపాటు సాగింది. ఆ చిన్నారులు గ్రామంలోని చిన్నారులతో గోళీలాట ఆడుతూ అందరినీ ఓడించి ఆట పట్టించేవారు. ఈ విషయాన్ని ఆ రజకుడు, పిల్లలు.. గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామ ప్రజలు.. రజకుడి వెంట వెళ్లారు. గ్రామ ప్రజలకు కూడా గాడిదలపై వచ్చినట్లుగా బాలలు దర్శనమిచ్చారు. ప్రజలు వారిని నిలదీయడంతో తాము దేవతలమనీ, అక్కాతమ్ముడైన సుంకులమ్మ, ముత్యాలయ్య అని తెలిపారు. తమ పేరున వైశాఖ పౌర్ణమికి ఐదు రోజులు తిరునాల జరపాలని సూచించారట. ఆ గ్రామ దేవతలు ఏడు కాండ్ల (14ఎద్దుల)తో రథాన్ని లాగించాలని తెలిపారట. ఉత్సవానికి బండిలేదని ప్రజలు తెలపడంతో ఆ బాలరూప దేవతలు.. మద్దికెర గ్రామంలోని రజక గురప్ప ఇంటి వద్ద గల బండిని తీసుకురమ్మని ఆజ్ఞాపించారట. ప్రజలు.. గురప్ప ఇంటికి వెళ్లి బండి కావాలని కోరారట. గుర్రప్ప ఆ బండిని ఇవ్వడానికి తిరస్కరించి, దేవతలను తూలనాడడంతో వారు విషయాన్ని ఆ బాల దేవతలకు తెలియజేశారట. ఆ దేవతలు బండారు (కుంకుమ, పసుపుల మిశ్రమం).. గ్రామ ప్రజలకు ఇచ్చి పంపారట. బాల దేవతలు చెప్పినట్లు ఇవ్వని పక్షంలో 'నీ సంసారం కూలుతుందని తెలియజేసినా' గుర్రప్ప తిరస్కరించడంతో వెనుదిరిగారట. వారంరోజులు తిరక్కుండానే గుర్రప్ప, ఆయన భార్య, కుమారులు మరణించడంతో గుర్రప్ప తల్లి ఆ బండిని రామరాజుపల్లి ప్రజలకు అప్పగించిందట. మద్దికెర నుంచి తెచ్చిన బండిలో చింతలచెరువు గ్రామం హంపమ్మ ఇంటి నుంచి తాటిమానును తీసుకొచ్చి సుడిబండి తయారు చేశారు. సుడిబండికి ఉన్న తాటిమానుకు వేళాడితే ఎలాంటి రోగమైనా నయమవుతుందని భక్తులు విశ్వసిస్తారు. సుడిబండికి నేతిగారెలు, నిమ్మకాయలు, పుష్పహారాలు వేలాడదీస్తారు. ఆ గ్రామ దేవతలకు రామరాజుపల్లిలో ఇళ్లే ఆలయం. గుత్తి-అనంతపురంలో ఆలయం నిర్మించారు. స్వామివార్లను చిలకమ్మ పల్లకిలో ఊరేగిస్తూ వెళుతుంటే ఏడు కాండ్ల ఎద్దులు వంతులవారీగా బండిశూల(రథం)ను లాగుతాయి. ఈ రథం మూడు గ్రామాల పొలాల మీదుగా వెళ్తుంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా రథోత్సవాన్ని మాత్రం ఆపరు. ఏయే పొలంలో వెళితే అక్కడంతా పంటలు బాగా పండుతాయని రైతులు విశ్వసిస్తారు.

ఎద్దుల కొనుగోలు

చుట్టుపక్కల గ్రామాల రైతులు బండిశూల రథోత్సవం కోసం ఎద్దులను సైతం కొనుగోలు చేస్తారు. లక్షలాది రూపాయలు వెచ్చించి, ఎద్దులు కొని వాటికి ముస్తాబు చేసి రథం(బండిశూల) లాగిస్తారు. కొందరు రైతులు మొక్కుబడి అని తెలియజేస్తున్నారు. రథోత్సవంకు కొనుగోలు చేసిన ఎద్దులతో తమ పొలాల్లో వేసవి దుక్కులు చేసుకొని తిరిగి వాటిని విక్రయిస్తుంటారు. ఏడాదిపాటు రథోత్సవంలో తమ ఎద్దులు ఎలా లాగాయో ఇతరులకు చెప్పుకుంటూ మురిసిపోతుంటారు.

బందోబస్తు నడుమ బండిశూల ఉత్సవం

గట్టి పోలీసు బందోబస్తు నడుమ బండిశూల ఉత్సవాలు నిర్వహించనున్నారు. 2014 మే 9న 132 కేవీ విద్యుత్ తీగలకు రథం తాకడంతో ఏడుగురు మృతిచెందగా.. 20 మంది గాయపడ్డారు. గతేడాది ఎన్నికల నేపథ్యంలో ఉత్సవాలు జరుగలేదు. దీంతో ఈ ఏడాది మరింత ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పోలీసుల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఆ గ్రామాల్లో దేవుళ్ల పేర్లే..

రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి-అనంతపురం గ్రామాల్లో ప్రతి ఇంటిలోనూ సుంకులమ్మ, ముత్యాలయ్య పేర్లు కలిసేలా కుటుంబ సభ్యుల పేర్లు ఉండడం విశేషం. ప్రతి ఇంటిలోనూ స్వామివారి పేర్లు మీద ఇద్దరు, ముగ్గురు ఉంటారు. గ్రామాల్లో ఒకేపేరు గల వ్యక్తులు పదుల సంఖ్యలో ఉండడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వ్యక్తితోపాటు ఇంటిపేరు చెబితేనే చిరునామా తెలుస్తుంది.

నేటి నుంచి ఉత్సవాలు

ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ బండిశూల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రామరాజుపల్లి ప్రజలు పేర్కొన్నారు. మొదటిరోజు 7న స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గంగాభవాని పూజ, సుంకులమ్మ, ముత్యాలయ్య స్వామి వార్ల ఊరేగింపు, జలధి బావి వద్ద జల పూజ, నైవేద్య కార్యక్రమం చేపడతారు. అనంతరం స్వామివారిని హంసవాహనంపై ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొస్తారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక పూజానంతరం రథానికి ఏడు కాండ్ల ఎద్దులు కట్టి లాగిస్తారు. రామరాజుపల్లి నుంచి గుత్తి-అనంతపురం వనం(వాగు) వద్ద గల దేవాలయానికి రథోత్సవం వెళ్తుంది. 8న సాయంత్రం గుత్తి-అనంతపురం వనం వద్ద దేవాలయం నుంచి రామరాజుపల్లికి రథోత్సవం ప్రారంభిస్తారు. 9న రామరాజుపల్లి నుంచి మరో సారి గుత్తి-అనంతపురంలోని వనం వద్దగల గుడికి రథం చేరుతుంది. 10న గుత్తి-అనంతపురం వనం వద్ద తిరునాళ (పరుష) నిర్వహిస్తారు. సాయంత్రం బోణాలతో నైవేద్యం సమర్పించిన తర్వాత రథం రామరాజుపల్లికి బయలుదేరుతుంది. రాత్రికి రామరాజుపల్లికి చేరుకుంటుంది. ఏయే గ్రామ పొలిమేరల వరకూ ఆయా గ్రామాల ఎద్దులు రథాన్ని లాగుతాయి. 11న స్వామి వారికి మొక్కుబడులు తీర్చుకుంటారు.



గుత్తిఅనంతపురంలో స్వామి వార్ల ఆలయం

పోలీసుల దూకుడు

- కుంటిమద్ది కేసు దర్యాప్తు వేగవంతం
- నిందితుల సంఖ్య వందకు పైగానే..?
- ఇప్పటి వరకూ 10 మంది అరెస్టు
- తహసీల్దారు వద్ద 17 మంది బైండోవర్
- తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి వాట్సా‌ప్‌లో నోటీసులు
- పైలెట్ అనిల్ కుమార్‌కు మూడో నోటీసు
- 12న వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచన

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద జగన్ పర్యటన సమయంలో చోటు చేసుకున్న ఘటనలపై పోలీసులు విచారణను వేగవంతం చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వాట్సాప్ ద్వారా నోటీసులు పంపించామని పోలీసులు తెలిపారు. వ్యక్తిగతంగా నోటీసులు ఇచ్చేందుకు అనంతపురంలోని ఆయన నివాసానికి బుధవారం వెళతామని తెలిపారు. మరోవైపు ఆ రోజు హెలిక్యాప్టర్ నడిపిన పైలెట్ అనిల్ కుమార్‌కు మూడో నోటీసును జారీ చేశారు. మొదటి రెండు నోటీసులకు ఆయన స్పందించినా, విచారణకు హాజరు కాలేదు. తనకు వర్చువల్‌గా హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. దీనికి పోలీసులు నిరాకరించారు. చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయానికి ఈ నెల 12న వ్యక్తిగతంగానే హాజరు కావాలని సూచించారు.

అరెస్టులు.. బైండోవర్లు..

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన సమయంలో కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. బారికేడ్లను తోసేసి, పోలీసులను నెట్టుకుంటూ హెలిక్యాప్టర్‌ను చుట్టుముట్టడం, దీన్ని భద్రతా వైఫల్యమని ఆరోపించడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. హత్యకు గురైన మజ్జిగ లింగమయ్య స్వగ్రామం పాపిరెడ్డిపల్లిలో ఇరుకైన దారులు ఉన్నాయని, జగన్ పర్యటనకు జన సమీకరణ చేయొద్దని పోలీసులు హెచ్చరించినా వైసీపీ నాయకులు పెడచెవిన పెట్టారు. విండ్ షీల్డ్ దెబ్బతిందని జగన్‌ను తిరిగి తీసుకువెళ్లకుండానే హెలిక్యాప్టర్ వెళ్లిపోవడంపైనా విచారణ జరుపుతున్నారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్న పోలీసులు ఇప్పటికే రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సహా 71 మందిపై కేసులు నమోదు చేశారు. మరో 30 మందిని కూడా నిందితులుగా చేర్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గతనెల 10వ తేదీన నమోదైన ఈ కేసులో ఇప్పటికే పది మంది వైసీపీ నేతలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. మరో 17 మందిని బైండోవర్ చేశారు. కేసులో ఉన్న పలువురు నిందితులకు 41 నోటీసులు జారీ చేసి విచారణకు పిలిపిస్తున్నారు.



తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

స్టేషన్ వద్ద హడావుడి

- రామగిరి జడ్పీటీసీ నాగార్జున, వైసీపీ నాయకులు ఎనుముల ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, అంకిరెడ్డి జయచంద్రారెడ్డి, దేవభూషణరెడ్డి, హరిజన ముత్యాలన్న, గుండల నారపరెడ్డి మంగళవారం విచారణకు హాజరయ్యారు. రామగిరి సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీధర్ వారిని ఉదయం నుంచే సాయంత్రం వరకు విచారించారు. హెలీప్యాడ్ వద్ద ఆ రోజు మీరు ఉన్నారా, ఎవరైనా రెచ్చగొట్టడంతో అక్కడికి వెళ్లారా, ఏదైనా ఉద్దేశంతో తోపులాట జరిగిందా అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము వైసీపీలో ఉన్నామని, జగన్‌పై అభిమానంతో చూసేందుకు వెళ్లామని పలువురు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.
- కేసు దర్యాప్తు నేపథ్యంలో రామగిరి సర్కిల్ కార్యాలయంలో హడావుడి కనిపిస్తోంది. నిందితుల అరెస్టు, నోటీసులు, బైండోవర్‌లు, విచారణలు.. ఇలా ఏదో ఒక ప్రక్రియ కొనసాగుతోంది. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా 100 మందికిపైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు అయింది. మండలాల వారీగా చూస్తే, ఇప్పటివరకూ చెన్నేకొత్తపల్లిలో 16 మంది, రామగిరిలో 11 మంది, కనగానపల్లిలో 19మంది, రాప్తాడులో 3, అనంతపురం రూరల్ 9, ఆత్మకూరులో 16 మందిపై కేసులు నమోదైనట్లు బహిర్గతమైంది.



గతనెల 8న కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద వైసీపీ శ్రేణుల హల్‌చల్

కేసులో ముఖ్య నాయకులు

రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు పలువురిని పోలీసులు నిందితులుగా చేర్చారు. చెన్నేకొత్తపల్లి మండలంలో జడ్పీటీసీ గోవిందరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి నిందితులుగా ఉన్నారు. కనగానపల్లి మండలంలో జడ్పీటీసీ మారుతీ, వైసీపీ మాజీ మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, రామగిరి మండలంలో జడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ మీనిగ నాగరాజు తదితరులు ఉన్నారు. రాప్తాడు మండలంలో ఎంపీపీ భర్త చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సాకే వెంకటేశ్, అనంతపురం రూరల్ మండలంలో పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకుడు పవన్ కుమార్ ఉన్నారు. ఆత్మకూరు మండలంలో వడ్డిపల్లి, మదిగుబ్బ సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహులు నిందితులుగా ఉన్నారు.

నేరచరితులే..

హెలీప్యాడ్ ఘటన కేసులో ఉన్న పలువురు వైసీపీ నేతలపై గతంలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కొందరిపై రౌడీషీట్ కూడా ఉంది. చెన్నేకొత్తపల్లి జడ్పీటీసీ గోవిందరెడ్డిపై ఓ భూవివాదంలో 2019లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వైసీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రరెడ్డిపై రౌడీషీట్ ఉంది. కనగానపల్లి మండల మాజీ కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డిపై కూడా పలు కేసులు ఉన్నాయి. రాప్తాడు మండల కన్వీనర్ సాకే వెంకటేశ్‌పై 2019 సాధారణ ఎన్నికల సమయంలో దాడులకు పాల్పడినట్లు కేసు నమోదైంది.

సజావుగా ఏపీ ఈసెట్

2,454 మంది విద్యార్థులు హాజరు



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాల కోసం ఏపీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్-2025) మంగళవారం సజావుగా ముగిసింది. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో నిర్వహించిన పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షలకు 2,548 మంది విద్యార్థులకు గాను 2454మంది హాజరైనట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ తెలిపారు. పరీక్ష సమయానికి అరగంట ముందే విద్యార్థులు కేంద్రాల్లో వెళ్లిపోయారు. ఏపీఈసెట్ కమిటీ చైర్మన్, జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌ఆర్ఐటీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఏపీఈసెట్ నోటిఫికేషన్ విడుదల నుంచి పరీక్షల నిర్వహణ వరకు అధికారులు, సిబ్బంది సమయస్ఫూర్తితో పనిచేశారని, వారి సహాయ సహకారాలతో సజావుగా ముగిశాయని వీసీ పేర్కొన్నారు. 8న ప్రాథమిక కీ విడుదల చేసి 17న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేత ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

గీతకులాల మద్యం షాపులకు రీ నోటిఫికేషన్

అనంతపురం అర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 4 గీత కులాల మద్యం షాపులకు మంగళవారం అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి రీ నోటిఫికేషన్ జారీ చేశారు. డి. హిరేహాళ్ మద్యం షాపునకు గౌండ్ల, రాయదుర్గం రూరల్ గౌడ, గుత్తి రూరల్‌కు గౌడ్, కంబదూరు మండలానికి ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్లలో ఎక్కడైనా ఈనెల 15వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 17వతేదీ అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9న మామిడి ఫలసాయం వేలం

బుక్కరాయసముద్రం, మే6(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలులో ఈనెల 9వ తేదీన మామిడి ఫలసాయానికి వేలంపాట నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ క్రాంతిరాజ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జైలులో ఉన్న 3,500 మామిడి చెట్లకు వేలంపాట ఉంటుందన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రేపు వేరుశనగ చెక్క వేలంపాట

అనంతపురం జిల్లా జైలులో ఈనెల 8వతేదీన వేరుశనగ చెక్క వేలంపాట నిర్వహిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ షఫివుర్ రహిమాన్ ప్రకటనలో తెలిపారు. జైలులో వేరుశనగ మిల్లులో ఉన్న 25 టన్నుల చెక్కను వేలం వేయనున్నట్లు ఆయన చెప్పారు.

బాలలుగా మళ్లీ బడిలో..!

42 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తమ టీచర్లతో పూర్వ విద్యార్థులు

కణేకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): బాలలుగా విడిపోయిన వారు వృద్ధాప్యానికి చేరువవుతున్న దశలో కలుసుకున్నారు. కుశల ప్రశ్నలతో, చిలిపి మాటలతో మళ్లీ బడిలో చిన్నారుల్లా సందడి చేశారు. 42 ఏళ్ల కిందట విడిపోయినవారు మళ్లీ కలుసుకోవడానికి స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వేదికయ్యింది. 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఒక చోటికి చేరారు. ఈ బడిలో చదివిన పూర్వవిద్యార్థులు వివిధ హోదాల్లో ఉన్నారు. వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిస్తూ, గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ఉపాధ్యాయుడు నాగరాజు, ఎంఈఓ లక్ష్మణ్ణ హాజరయ్యారు. పూలమాలలు వేసి బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, గోపాల్, పీరబాష, ఎర్రిస్వామి, వెంకటేశలు, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24,560, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 674టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీళ్లకు నిధులు

గుత్తి తాగునీటి ప్రాజెక్టుకు రూ.211.78 కోట్లు

హామీ నిలుపుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే

సెప్టేజ్ మేనేజ్‌మెంటు కింద ఉమ్మడి జిల్లాకు సొమ్ములు



గుత్తి పట్టణం

గుంతకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): గుత్తి పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు నిధులను సమకూరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వును వెలువరించింది. గుత్తి పట్టణంలో తాగునీటి సమస్యను ఏడాదిలో పరిష్కరిస్తానంటూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఆమేరకు మొదటి సంవత్సరంలోనే పాక్షికంగా సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే, శాశ్వత పరిష్కారం దిశగా కృషిచేసి ప్రభుత్వం నుంచి నీటి పథకానికి నిధులను సాధించారు. త్వరలో టెండరు ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 70 శాతం బ్యాంకు రుణంగా ఇవ్వనుంది. గుత్తిలో తాగునీటి శాశ్వత పరిష్కారానికి ఆంధ్ర ప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు (ఏపీయూడబ్ల్యూఎస్ అండ్ ఎస్ఎంఐపీ) పథకం కింద నిధులను కేటాయిస్తూ జీవోను విడుదల చేసింది.

తాగునీటికి రూ. 211.78 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం 25 పట్టణాలలో తాగునీటి సమస్య, రెండు పట్టణాల్లో మురుగునీటి నిర్వహణ (సెప్టేజ్ ట్రీట్మెంట్) పథకాలకు నిధులను కేటాయిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా గత నెల 24న ఉత్తర్వులను విడుదల చేసింది ఈ మేరకు రాష్ట్రంలోని 25 పట్టణాలలో తాగునీటి పథకాల నిర్మాణానికి రూ. 2,468.63 కోట్లు, సెప్టేజ్ మేనేజిమెంట్ కోసం రెండు పట్టణాలకు రూ. 56.28 కోట్లు కలిపి మొత్తం రూ. 2,524.91 కోట్ల నిధులను కేటాయించింది. ఇందులో గుత్తి పట్టణంలో నీటి ఎద్దడి పరిష్కారానికి రూ. 211.78 కోట్లను కేటాయించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పెనుకొండకు రూ. 60.72 కోట్లు, మడకశిరకు రూ.72.83 కోట్లు, కళ్యాణదుర్గంకు రూ.151.70 కోట్లు, పుట్టపర్తికి రూ.115.70 కోట్లు, సెప్టేజ్ మేనేజ్‌మెంటు కింద మడకశిరకు రూ.28.90 కోట్ల నిధుల కేటాయించారు.

70 శాతం రుణం, 30 శాతం గ్రాంటు

రాష్ట్రంలో తాగునీరు, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో 70 శాతం (రూ. 3,487.67 కోట్లు) ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) సమకూర్చ నుండగా, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం (రూ. 1,494.39) కోట్ల గ్రాంటు ఇవ్వనుంది. ఈ లెక్కన గుత్తి పట్టణ తాగునీటి నివారణకు మంజూరు చేసిన రూ. 211.78 కోట్ల నిధుల్లో రూ. 148.19 కోట్లు బ్యాంకు రుణంగా, రూ. 63.51 కోట్లు రాష్ట్ర గ్రాంటుగా లభించనుంది. బ్యాంకు రుణ మొత్తాలను అర్బన్ లోకల్ బాడీ అయిన గుత్తి పురపాలక సంఘం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు, పురపాలక సంఘాలకు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖా మంత్రికి, ఆశాఖ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి ఉత్తర్వును పంపారు. ఈ నెల 9న ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు నాయుడు గుత్తి తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నామంటూ ప్రకటించే అవకాశం ఉంది.

ఇచ్చిన మాట నిలుపుకుంటా: గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే



ఎన్నికల ముందు గుత్తి ప్రజల దుస్థితిని కళ్లారా చూశా. ఏది చేసినా.. చేయకున్నా మొదట గుత్తిలో తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని గట్టిగా నిర్ణయించుకున్నా. అందుకే పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియకున్నా, ఒక సంవత్సరంలోపే గుత్తి నీటి సమస్యను పరిష్కరిస్తానంటూ అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయినప్పటి నుంచీ ఒకే లక్ష్యంతో పనిచేశా. ఎలాగైనా మొదటి సంవత్సరంలోనే గుత్తి తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నా. తొలి యత్నంగా బోర్లు, వాటర్ ట్యాంకులు, స్పాట్ డెలివరి ట్యాంకుల ద్వారా తాత్కాలిక ఉపశమనం కలిగించా. ముఖ్యమంత్రి కూడా ఈ విషయంగా ఎంతో సహకరించి నిధులను విడుదలచేశారు. ఆయనకు ధన్యవాదాలు.

రైతు ఆత్మహత్య

యల్లనూరు, మే6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్జాంపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణయ్య (51) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. కృష్ణయ్య నాలుగు ఎకరాల పొలంలో అరటి పంట సాగు చేశాడు. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.10లక్షలకు పైగా అప్పు చేశాడు. గతనెలలో వీచిన గాలివానకు అరటిపంట దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈక్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరక తీవ్రంగా మనస్తాపం చెందాడు. సోమవారం రాత్రి ఇంటిలో నిద్రించడానికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఇతడికి భార్య భవానీతోపాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికి వివాహాలు అయ్యాయి. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా



బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

శెట్టూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడిపల్లి గ్రామం వద్ద కనుకూరు నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు మంగళవారం అదుపు తప్పి బోల్తా పడింది. అయితే బస్సు రోడ్డుపక్కన పంట పొలాల్లో పడటంతో అందులో పదిమందికి పైగా ఉన్న ప్రయాణికులకు గాని డ్రైవర్‌కు గానీ ఎటువంటి గాయా లు కాలేదు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు.

యువకుడి ఆత్మహత్య

గుమ్మఘట్ట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామంలో ప్రకాష్(30) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన తెలిపిన మేరకు కలగోడు గ్రామానికి చెందిన ప్రకాష్‌కు పూలకుంట గ్రామానికి చెందిన నాగేంద్రమ్మతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య నాగేంద్రమ్మ పుట్టినింటికి వెళ్లడంతో ప్రకాష్ కూడా సోమవారం సాయంత్రం వెళ్లాడు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ అర్ధరాత్రి సమయంలో బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాష్‌కు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడని బంధువులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యామద్దలలో వృద్ధుడు...

చెన్నేకొత్తపల్లి: కడుపు నొప్పి తాళలేక మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య(67) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. వృద్ధుడు గడచిన ఆరు నెలలుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండేవాడన్నారు. కుటుంబసభ్యులు వైద్యచికిత్సలు చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో గతంలోనే ఓ సారి ఆత్మహత్యకు విఫలయత్నం చేశాడు. తిరిగి కడుపునొప్పి బాధ భరించలేక సోమవారం రాత్రి ఇంటిలో విషపు గుళికలు మింగాడు. అపరస్మారకస్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు గమనించి, అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రికి మృతి చెందాడు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అదృశ్యమైన బాలుడి మృతి

బావిలో శవంగా తేలిన చిన్నారి



అఖిల్ (ఫైల్)

నంబులపూలకుంట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరవాండ్లపల్లికి చెందిన నారాయణ, చంద్రకళ దంపతుల కుమారుడు అఖిల్(7) మంగళవారం బావిలో శవమై తేలాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి ఆడుకోవడానికి వెళ్లిన బాలుడు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు సోమ, మంగళవారాల్లో గ్రామానికి సమీపంలోని బావులు, మండలంలోనీ సీసీ కెమెరాలను క్షుణంగా తనిఖీ చేశారు. గ్రామానికి సమీపంలోని ఎర్రగుంట బావి వద్ద మంగళవారం సాయంత్ర ం నీటిపై బాలుడిశవం తేలియాడుతుండగా బయటికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం పంపినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దాసరి వీధిలో జరగనున్న ఓ బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. కాలనీకి చెందిన రమణ, లక్ష్మి దంపతుల కూమార్తెను అదే కాలనీకి చెందిన వెంకటప్రతాప్ అనే యువకుడికి ఇచ్చి ఈనెల 8న స్థానిక కాలువ గడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో వివాహం జరిపేలా నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కాలనీకి వెళ్లి ఇరు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు సమక్షంలో హాజరు పరిచారు. బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. మైనార్టీ తీరే వరకు వివాహం జరపరాదని సూచించారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ సమితి సభ్యులు రమాదేవి, మహిళా పోలీస్ మంజుల, వీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.

ఐటీఐలో షార్ట్‌టర్మ్ కోర్సులు

అనంతపురం సెంట్రల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టూ వీలర్ సర్వీస్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు రెండునెలల శిక్షణ ఇస్తారన్నారు. ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వ సర్టిఫికెట్‌ను అందజేసి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 12లోపు వారి బయోడేటాను కళాశాలలో అందజేయాలని కోరారు.

గుత్తిలో రైతు నుంచి నగదు అపహరణ

గుత్తి, మే 6(ఆంధ్రజ్యోతి): ఓ రైతు బ్యాంక్‌లో డ్రా చేసుకొని తన ద్విచక్రవాహనంలో ఉంచిన నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన గుత్తిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గుత్తి మండలం మాముడురు గ్రామానికి చెందిన మల్లికార్జున తమ వద్ద ఉన్న బంగారాన్ని సోమవారం గుత్తిలోని కెనరాబ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ. లక్ష రుణం తీసుకున్నాడు. ఆ నగదును బ్యాంక్ బయట ఉన్న ద్విచక్రవాహనంలోని బ్యాగ్‌లో ఉంచాడు. అనంతరం బ్యాంక్ సమీపంలో ఉతి్న దుకాణం వద్దకు వెళ్లాడు. ఇదే అదనుగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పథకం ప్రకారం బైక్‌లో ఉన్న నగదును తీసుకుని ద్విచక్రవాహనంలో ఉడాయించారు. రైతు కేకలు వేసేలోపే వారు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పీఏబీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హనుమంతరావు ఆనంద్

అనంతపురం క్లాక్‌టవర్, మే 6(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హనుమంతరావు ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అహుడా సెక్రటరీ బదిలీ

అనంతపురం క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): అహుడా సెక్రటరీ గౌరీశంకర్‌రావు బదిలీ అయ్యారు. మంగళవారం తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

దోబీఘూట్‌లో తొట్టెలు శిథిలం

• బోరులో అడుగంటిన నీరు • ఇబ్బంది పడుతున్న రజకులు

తనకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దోబీఘాట్ లేక స్థానిక రజకులు ఇబ్బందులు పడుతున్నారు. 70 కుటుంబాలు రజక వృత్తితో జీవనం సాగిస్తున్నాయి. దశాబ్దాలుగా దుస్తులు ఉతకడానికి తనకల్లు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపాగ్ని నదికి పోయేవారు. గతంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సొంత నిధులతో బోరు వేయించి, మోటారు ఏర్పాటు చేసి.. దోబీ ఘాట్ నిర్మించారు. ప్రస్తుతం ఆ బోరులో నీరు అడుగంటి పోవడంతో అరకొరగా వస్తున్నాయి. దోబీఘాట్ కోసం నిర్మించిన తొట్టీలు కూడా శిథిలమైపోయాయి. దీంతో ఓ గుంతలో నిల్వ ఉన్న నీటిలో రజకులు బట్టలు ఉతుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కాగా, ఆ ఘాట్ వద్దే ప్రభుత్వ నిధులతో మరో బోరు కూడా వేయించింది. అయితే దానికి మోటర్ లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. దీనికి మోటర్ ఏర్పాటు చేయాలని, దోబీఘాట్లు ఏర్పాటు చేయాలని స్థానిక రజకులు కోరుతున్నారు. వసతులు సరిగా లేకపోవడంతో వృత్తిని మానేసి పలువురు రజకులు ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్తున్నారని వాపోయారు.



నిల్వ నీటిలో బట్టలు ఉతుకుతున్న రజకులు

ఇబ్బందులు పడుతున్నాం



కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం బోరులో నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాపాగ్ని నదికి వెళ్లలేకపోతున్నాం. దోబీఘాట్‌లో నిరుపయోగంగా ఉన్న మరో బోరుకు విద్యుత్ మోటరు అమర్చాలి. నీటి తొట్టీలు నిర్మించాలి.

-ఎగువిండ్ల నారాయణ, తనకల్లు

దోబీఘాట్ నిర్మించాలి



గతంలో ఎమ్మెల్యే నిర్మించిన దోబీ ఘాట్ పూర్తిగా శిథిలమైంది. బోరులో నీరూ అరకొరగా వస్తోంది. కొత్త ఘాట్‌ను నిర్మించేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలి. ఈ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నాం. ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నదికి వెళ్లలేక.. ఇక్కడ కొద్దిపాటి నీళ్లల్లోనే గుడ్డలు ఉతుకుతున్నాం. వెంటనే దోబీ ఘాట్ నిర్మాణం చేపట్టాలి.

-దిగువిండ్ల నాగలక్ష్మీ, తనకల్లు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

గాండ్లపెంట, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నాయకులు, కార్యకర్తలు నేరుగా తన దృష్టికి తీసుకు రావాలనీ, వాటిని పరిష్కరించడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో సమస్యలపై కార్యకర్తలు ఆరా తీసి.. తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతికార్యకర్త పని చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ కన్వీనర్ కొండయ్య, శివరామ్ ప్రతాప్, సింగ్ విండో మాజీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు రహంతుల్లా, శివప్పనాయుడు, ఎంపీటీసీ జయరామక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ గంగరాజు, మాజీ సర్పంచ్ ప్రసాద్, ఆనంద్, అక్రమ్‌బాషా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

● పోస్టర్ విడుదల: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికల వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ పద్మావతమ్మ, తహసీల్దార్ బాబురావు, ఎంపీడీవో వెంకటారెడ్డి, ఏపీఎం సూర్యనారాయణ మండల కన్వీనర్ కొండయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

కదిరి, మే 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. కదిరప్ప డిమాండ్ చేశారు. నల్లచెరువు మండలంలోని బొమ్మిరెడ్డిపల్లిలో మంగళవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలకు తాగునీరు, మజ్జిగ, ప్రథమ చికిత్స పరికరాలు, నీడను ఏర్పాటు చేయాలన్నారు. సంవత్సరానికి వందరోజులు పనులు కల్పించాల్సి ఉండగా 30 రోజులు కూడా కల్పించలేదన్నారు. ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, పనులు గుర్తించడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు రామోహన్, వెంకటరమణ, శ్రీనివాస్, చౌడమ్మ, నారాయణమ్మ, లక్ష్మీదేవి, మలేశ్వరీ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలో మాట్లాడుతున్న నాయకులు



పోస్టుకార్డు ఉద్యమంలో వాల్మీకులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరిఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రధాన మంత్రి మోదీకి మంగళవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో శాంతమ్మ, అంజనాదేవి, ప్రమీల, నాగవేణి, వెంకటేష్, నాగార్జున, రమేష్ పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం తక్షణం కులగణనను చేపట్టాలి

దేశంలో కులగణన కాంగ్రెస్ విజయం : సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మడకశిర, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఒత్తిడి కారణంగానే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కులగణనకు సమ్మతించిందని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. మడకశిర మండలంలోని నీలకంఠాపురంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండు చేశారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో యూపీఏ జనభా గణనతో పాటు కులగణన మీద సర్వే చేసిందని అన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ నివేదికను విడుదల చేయలేదని అన్నారు. కులగణను చేపట్టాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బారత్ జోడో యాత్రలో, పార్లమెంటులో లేవనెత్తారని అన్నారు. కులగణన కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయమని అన్నారు. దేశంలో ప్రైవేటు విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని, ఆ దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలని యూపీఏ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసిందని, దానిని ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని అన్నారు. తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లను అమలు అవుతున్నాయి, మిగిలిన రాష్ట్రాల్లో 50 శాతమే అమలవుతున్నాయని అన్నారు. ముందు నుంచి భారతీయ జనతా పార్టీ రిజర్వేషన్‌లకు వ్యతిరేకమని ఆరోపించారు.

ఆదర్శ విద్యార్థినుల ప్రతిభ

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం



ప్రతిభ చూపిన ఆదర్శ విద్యార్థినులు

పుట్టపర్తిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆదర్శ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని ఆపాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు మంగళవారం ఓప్రకటనలో తెలియచేశారు. ఈనెల 3, 4 తేదీల్లో ఒంగోలు జిల్లా మార్కాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు ఓంశ్రీ, వినీత, లేఖన, ఫర్హాన్, శాలిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించారన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయి పోటీల్లో సైతం రాణించాలని ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ అజీంపాషా ఆకాంక్షించారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి



బత్తలపల్లి : మానవహారంగా ఏర్పడిన ప్రజాసంఘాల నాయకులు



ఓడీసీ : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బత్తలపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఫాదర్ ఘాట్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తహసీల్దార్ స్వర్ణలతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, వెంకటేష్, వినయ్, రఫి, వీరనారప్ప, రామక్రిష్ణ, సుదర్శన్ పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండలఅధ్యక్షుడు రామాంజినేయులు, ఎంఈఎఫ్ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో కార్యకర్తలు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రమణ, ముద్దులపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రజా యోగా శిక్షణ

ధర్మవరం, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజా యోగా శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నుంచి 17 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ హాల్ ప్రతినిధులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని రోజూ ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని, 5 నుంచి 18 సంవత్సరాల వయసుగల పిల్లలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9042070246, 9642254375 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ధర్మవరం, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తుంపర్తి గ్రామానికి చెందిన తుంపర్తి పరమేశ్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. సోమవారం విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి అనుచరుడైన ఇతను గతంలో టీడీపీ, బీజేపీలో కొనసాగారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ఓబుళదేవరచెరువు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆర్ఎంపీ క్రిష్ణమూర్తి, మల్లెల రమేష్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. 35 మందికి పరీక్షలు నిర్వహించి.. 15 మందికి కంటి అద్దాలు అందజేశారు. 11 మందిని ఉచిత ఆపరేషన్‌కు ఎంపిక చేశారు.

దరఖాస్తు చేసుకోండి

తనకల్లు, మే 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన ఎస్సీ కులాలవారు రుణాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల పదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పూలరెడ్డెప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 60 సంవత్సరాలలోపు ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ముదిగుబ్బ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్డంపల్లి తండాలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ తండాలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆ తండావాసులు గతంలో ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన.. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మండల పరిషత్ నిధులతో నూతన బోరు వేయించి పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. దీన్ని ఎంపీపీ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూడేరు రాము, గొడుగు అమీర్, ప్రసాద్, బాస్కర్, లక్ష్మీ ప్రసాద్, ఆవుల చంద్ర పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ముదిగుబ్బ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్ళ అనంతపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కౌమర బాలిక వికాస సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా కిశోర బాలికలకు శానిటరీ ప్యాడ్స్ ఉపయోగం, పరిశుభ్రత, కౌమార బాలికలు జనజీవన స్రవంతిలో ఎలా నడుచుకోవాలి, బాలికల చట్టాలు, బాల్యవివాహాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ సరస్వతి, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి శ్రీలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రజియా పాల్గొన్నారు.

● కదిరి: నల్లచెరువులోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కిషోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా, ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ రఫీవున్నీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పాడి విత్తనాలతో అనేక లాభాలు



రైతులకు సూచలిస్తున్న ఏడీఏ

బుక్కపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ముందు పొడి విత్తనాలు దుక్కిలో చల్లడం వల్ల రైతులు అనేకలాభాలు పొందవచ్చని ఏడీఏ సనావుల్లా తెలిపారు. మంగళవారం మండలంలో నిమరాల గ్రామంలో శ్రీమాన్సు డ్రై సోయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే భూసార ఆధారిత ఎరువులు వాడకం పథకం కింద మట్టి నమూనా సేకరణ విధానాపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో ఏఓ సతీష్‌బాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు స్థలాల కేటాయింపు

కదిరి, మే 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కదిరి, తలుపుల, గాండ్లపెంట, ఎన్పీకుంట, నల్లచెరువు, తనకల్లు మండలాల్లోని 29 గ్రామాల్లో ఎస్సీ హిందూ శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించారు. శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని గతంలో ఆయా గ్రామాల్లో ఎస్సీలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను గతంలో విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

కొనసాగిన సీహెచ్‌ఓల సమ్మె

పుట్టపర్తి రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సీహెచ్‌ఓలు జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మె మంగళవారానికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

దాడితోటలో సోదాలు

తాడిమర్రి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాడితోట గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ముదిగుబ్బ సీఐ శ్యామరావు, తాడిమర్రి ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని, ఖాళీ స్థలాలను సోదాలు చేశారు. ప్రత్యేకంగా రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. తగాదాల జోలికి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

ధర్మవరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో రైతులందరూ తమ పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలని (మట్టి నమూనాలు) ఏఓ ముస్తాఫా తెలిపారు. మంగళవారం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో మట్టినమూనాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి పొలాలకు ఎరువులు ఉపయోగించుకోవాలన్నారు. ఇందులో సర్పంచ బాబయ్య, గ్రామ ఉద్యాన సహాయకుడు భార్గవ్, రైతులు ఉన్నారు.



భూసార పరీక్షలను పరిశీలిస్తున్న ఏఓ

క్రైం న్యూస్..

స్టూడియోలో చోరీ

కదిరి, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులోని బాబా స్టూడియోలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు స్టూడియో నిర్వాహకుడు ఫకృద్దీన్ మంగళవారం తెలిపారు. దుండగలు స్టూడియోలోకి ప్రవేశించి కంప్యూటర్ హార్డ్ డిస్క్, రూ.20వేల నగదు చోరీ చేసినట్లు చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

జూదరుల అరెస్టు

కదిరిఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకులవాండ్లపల్లి వద్ద పేకాట స్థావరంపై మంగళవారం దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.2,050 స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం, మే 6(ఆంధ్రజ్యోతి): అత్తింటి వారు వేధిస్తున్నారంటూ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రెండు కేసులు నమోదయ్యాయి. స్థానిక సత్యసాయినగర్‌లో దంపతులు విజయలక్ష్మి, రవికుమార్ నివాసముంటున్నారు. అదనపు కట్నం కోసం తనను భర్తతో పాటు అత్త లక్ష్మీదేవి, మామ పెద్దన్న, ఆడపడుచు పద్మావతి, మరిది పెద్దన్న నిత్యం వేధిస్తున్నారని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

● తారకరామాపురం: తారకరామాపురంలో షేక్ నఫ్రాసి, మహమ్మద్‌వలీ నివాసముంటున్నారు. తన ప్రవర్తన బాగాలేదని నిత్యం వేధిస్తున్నారని తన భర్తతో పాటు అత్తమామలు జుబేదా, ఫకృద్దీన్, మరదులు మసూద్‌వలీ, జీలన్‌పై షేక్ నఫ్రాసి టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీరిపై కూడా కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.



రీజనల్ కమిటీ నూతన సభ్యులు

ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ కమిటీ ఏర్పాటు

పుట్టపర్తి, మే 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ నూతన రీజనల్ కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం ఆ సంఘం నాయకులు స్థానిక బస్ డిపో వద్ద నిర్వహించిన సమావేశంలో ఈ కమిటిని ఎంపిక చేశారు. రీజనల్ అధ్యక్షుడిగా జీవైపీ రావు, కార్యదర్శిగా శ్రీనివాసులు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా నారాయణస్వామి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్ఎస్‌రెడ్డి, కోశాధికారిగా డీవీ రమణప్పను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు డీపీటీఓ మధుసూదన్‌ను కలిసి సన్మానించారు. ఇందులో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేబీ నాగార్జునరెడ్డి, నాయకులు ఆర్‌వీ లక్ష్మీదేవి, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆశాల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కదిరిఅర్బన్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆశకార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు మండలంలో పట్నం ఆశా కార్యకర్తలు మంగళవారం పట్నం మెడికల్ అధికారి ప్రమీలకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందించారు. ఒప్పంద జీఓలను విడుదల చేయాలని, నియామకాలు ప్రభుత్వం చేపట్టాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ఈ సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ సాంబశివ, మస్తాక్, ఆశకార్యకర్తలు ఆంజనమ్మ, గంగులమ్మ, నాగలక్ష్మీ, రమాదేవి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి

బత్తలపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చుమడుగు క్రాస్ వద్ద ఉన్న జేఆర్ సిల్క్ యూనిట్‌లో కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరులు మాట్లాడుతూ... కార్మిక చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్మికులకు సౌకర్యాలు కల్పించకున్నా.. అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఫ్యాక్టరీ యజమానులు కూడా కార్మికుల వసతులపై దృష్టి పెట్టి.. వారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో లెబర్ ఆఫీసర్ సురేష్, ఎస్ఐ గోవిందు, లాయర్లు బాలసుందరి, జింకా రామంజినేయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం స్వాధీనం



అంగన్‌వాడీ భవనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

కదిరి, మే 6(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని ఉప్పార్లపల్లిలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని కాంట్రాక్టర్ నుంచి అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కాంట్రాక్టర్ బిల్లులు రాలేదన్న కారణంగా ఆ భవనం తాళాలు తన వద్దే ఉంచుకున్నాడు. ఈ విషయంపై గతంలో పత్రికలు కథనాలను ప్రచురించాయి. స్పందించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ఆ భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నేడు వాహనాల వేలం

కదిరి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులో స్వాధీనం చేసుకున్న వాహనాలను బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ మంగళవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రూ.5వేలు నగదు చెల్లించాలన్నారు.

కొత్త పనులు వద్దు బాబోయ్..

ప్రారంభించేందుకు ససేమిరా

పూర్తిచేసిన వాటికి బిల్లులు రాక ఇబ్బందులు

వడ్డీ కట్టలేకపోతున్నామని నేతల ఆవేదన



బిల్లురాని పూలకుంటలో వేసిన సీసీ రోడ్డు

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి విడతలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ప్రతి నియోజకవర్గానికి రూ.30 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్లు, గోకులంషెడ్లు నిర్మించారు. మొదట్లో వారం వారం బిల్లులు పడ్డాయి. అలాగే బిల్లులు వస్తాయని పోటీపడి, ప్రజాప్రతినిధులతో గొడవపడి కూటమి నాయకులు పనులు దక్కించుకున్నారు. అన్నీ నామినేటెడ్ పనులే కావడంతో మొదటి విడతలో తెలుగేదశం పార్టీ నాయకులే అధికంగా చేపట్టారు. నియోజకవర్గంలో 40 నుంచి 50శాతంలోపే బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన బిల్లులు ఆరు నెలలు దాటుతున్నా అతీగతీలేదు. అధికారులను అడిగితే వచ్చేనెల అంటూ కాలయాపన చేస్తున్నారు. వడ్డీకి అప్పులు తెచ్చి.. పనులు చేసిన వారు.. బిల్లులు అందక దిక్కులు చూస్తున్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగిన బిల్లులు

ప్రభుత్వం వచ్చిందనీ, వెంటనే బిల్లులు వస్తాయని అప్పులుచేసి పనులు పూర్తిచేసిన కూటమి పార్టీలోని ద్వితీయశ్రేణి నేతలు దిక్కులు చూస్తున్నానను. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. దీంతో గ్రామ, మండలస్థాయిలో భారీగా పనులు చేపట్టారు. పూర్తిచేసి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడంలేదు. దీంతో బిల్లులు ఇప్పించాలని కొన్నిచోట్ల ఎమ్మెల్యేల వెంట పడుతున్నారు. ఈ కారణంగా రెండో విడత కింద ఒక్కో నియోజకవర్గానికి రూ.15కోట్ల నుంచి రూ.20 కోట్లదాకా పనులు మంజూరైనా వాటిని చేపట్టడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. ఎంతోకొంత ఆదాయం వస్తుందని టీడీపీ నాయకులు చాలావరకు అప్పులు చేసి ఉపాధి పథకం కింద పనులు చేశారు. పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లులు చెల్లింపులు జరిగాయి. మొదటి మూడు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. దీంతో బిల్లులు వెంటనే వస్తాయన్న ఉద్దేశంతో పలువురు పెద్దఎత్తున పనులు చేశారు. బిల్లులు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

అప్పుడూ.. ఇప్పుడూ.. అలాగే..

గత టీడీపీ హయాంలో కూడా ఆ పార్టీ నేతలు పెద్దఎత్తున వర్కులు చేశారు. ఆ తరువాత అధికారం కోల్పోవడంతో వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులు ఆపేసింది. దీంతో చాలామంది అప్పుల పాలై, కొంతమంది ఆత్మహత్యల వరకు వెళ్లారు. మరికొంతమంది కోర్టును ఆశ్రయించారు. కూటమి అధికారంలోకి వచ్చాక పాత బిల్లులు చెల్లిస్తారని నాయకులు ఆశించారు. ప్రస్తుతం ఆ ఊసే ఎత్తట్లేదు. ఈసారైనా పోయిన సొమ్ము సంపాదించుకుందామని పనులు చేపడితే మొదటి విడతలోనే ఇలా కావడంతో అధికార పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోని పరిస్థితి ఇప్పుడు కూడా ఎదురుకావడంతో కొంతమంది పనిచేసిన నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులుచేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. పనులుచేసి అప్పులపాలై వడ్డీలు కట్టలేకపోతున్నామని రోజూ ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు క్యూ కడుతున్నారు. అప్పుడూ.. ఇప్పుడూ.. ఇలాగే అయితే తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు.

పోటీపడి దక్కించుకున్నారు..

ఉపాధిహామీ నిధుల కింద మంజూరైన పనులకు సంబంధించి మొదట బిల్లులు పడటంతో కొంతమంది నేతలు పోటీపడి కార్యకర్తలకు పనులు అప్పగిస్తే వారి వద్ద నుంచి రూ.లక్షకు 5శాతం నుంచి 8శాతం వరకు కమీషన్ వెచ్చించి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకున్నారు. కొంతమందికి ఎనిమిది నెలలవుతున్నా బిల్లులు రాకపోవడంతో చేసిన పనికి అసలు కూడా వచ్చే పరిస్థితి లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. లేపాక్షి మండలంలో ఓ పంచాయతీకి సంబంధించి అధికార పార్టీ నాయకుడు.. కార్యకర్తలకు ఇచ్చిన పనులకు సంబంధించి కొంతమొత్తం వారికి ఇచ్చి పనులు తానే చేపట్టాడు. అతడి వద్ద డబ్బు లేకపోవడంతో నూటికి రూ.3 వడ్డీతో వేరేవారి వద్ద డబ్బు తీసుకొచ్చి పనిచేశాడు. ఆయనకు రూ.40లక్షలకుపైగా బిల్లులు రావాలి. ప్రస్తుతం కట్టిన వడ్డీ, ఇచ్చిన మొత్తం కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నాడు.

షిర్డీనగర్‌లో సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోమందేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీనగర్‌లో ఎట్టకేలకు అధికారులు స్పందించి సర్వే నిర్వహించారు. మంగళవారం వంక ఆక్రమణలపై సర్వేయర్ వినోద్ బృందం షిర్డీనగర్‌లో పర్యటించారు. కొన్నేళ్లుగా సర్వేనంబరు 161, 162, 163లోగల వంక ఆక్రమణకు గురైంది. దీంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచి రోడ్లు బురదమయంగా మారడం, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు తిరగసాగారు. వంకను సర్వేచేసి హద్దులు నిర్ణయించాలని కోరారు. అధికారులు మారుతూ వచ్చారుకానీ షిర్డీనగర్‌లో సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వంక ఆక్రమణతో ఇబ్బందులు అనే శీర్షిక ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు వంక ఆక్రమణలపై రెవెన్యూ మ్యాప్ ఆధారంగా సర్వేచేపట్టారు. సర్వేయర్ వినోద్ మాట్లాడుతూ సర్వేరిపోర్టులు తహసీల్దార్‌కు అందజేస్తామన్నారు. ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.



షిర్డీనగర్‌లో వంకను సర్వే చేస్తున్న దృశ్యం

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

పెనుకొండ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రొద్దం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ నర్సింగప్ప ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల పెనుకొండ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, వివరాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ నరేంద్రకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అదేవిధంగా కర్ణాటక సరిహద్దు ఉన్నందున తీసుకోవాల్సిన చర్యలను పోలీసులకు వివరించారు.

'అనుమానంగా కనిపిస్తే సమాచారం ఇవ్వండి'

లేపాక్షి, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నరేంద్ర సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కొండూరు గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి అనుమానం ఉన్న వ్యక్తుల గృహాలను తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులకు సమావేశం నిర్వహించి ఎటువంటి గొడవలకు దిగకుండా సుఖసంతోషాలతో జీవనం సాగించాలన్నారు. భూ సమస్యలుంటే కోర్టుద్వారా పరిష్కరించుకోవాలని, గొడవలకు దిగకూడదని సూచించారు.

కులగణనకు సర్వర్ సమస్య

పావగడ, మే 6(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా కులగణన కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమైంది. అయితే ప్రతి ఇంటికి సర్వేకి వెళ్తున్న అధికారులకు సర్వర్ సమస్య వెంటాడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సర్వర్ సమస్య తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

అమరాపురం, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. తడి చెత్త పొడిచెత్త వేరుచేసి చెత్త రిక్షాలో వేయాలని సూచించారు.

ఘనంగా మారెమ్మ దేవత ఉత్సవం

అగళి, మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మారెమ్మ దేవత రత్నగిరి కొల్లాపురి మహాలక్ష్మీ అమ్మవారు అట్టి మారెమ్మ దేవత ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోస్తూ మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఇనగలూరు గ్రామంలో కూడా కొల్లాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.

పూజల్లో పాల్గొన్న అనంత ఎంపీ



పూజల్లో పాల్గొన్నఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): వాసవీ జయంతి వేడుకల్లో భాగంగా 6వ రోజు మంగళవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు జేపీకే రాము, ఆదర్శ్ శ్రీకాంత్, రవీంద్ర ఎంపీ దంపతులను సన్మానించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ కాలనీ సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. మోడల్ కాలనీ సమీపంలో రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి ముళ్లపదల్లోకి పడి మృతిచెందాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా గుర్తుపట్టలేని స్థితిలో ఉందన్నారు.


విద్యార్థుల సృజనను వెలికితీయడం అభినందనీయం: రచయిత సడ్లపల్లి



ఎంపీ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీయడం అభినందనీయమని ప్రముఖ కవి రచయిత సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు రూపొందించిన కుముద్వతి వార్షిక సంచికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రగతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జరిగిన కార్యక్రమంలో చిదంబర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. తెలుగులోనే కాకుండా ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో కూడా విద్యార్థులు కథలు, కవితలు, అనుభవాలు, వ్యాసాలు రాయించి అందంగా గీసిన చిత్రాలను ముద్రించిన పుస్తకం ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయండి: ఎమ్మెల్యే



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

పావగడ, మే 6(ఆంధ్రజ్యోతి): అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమెలేప్యే వెంకటేశులు సూచించారు. తాలూకా వ్యాప్తంగా వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. పనుల మీద వచ్చే ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మంగళవారం కేడీపీ సభలో పాల్గొని మాట్లాడారు. బెస్కమ్ కార్యాలయంలో డబ్బులు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు స్తంభాలు అందజేస్తున్నారని ఈ విషయంపై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి చిత్తశుద్ధితో అందించాలన్నారు. అధికారులు కేంద్ర స్థానంలోనే ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. లేనిపక్షంలో నచ్చినచోటకు బదిలీ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరామ్, నీటిశాఖ అధికారి బసవలింగప్ప, పటేల్, సీడీపీఓ సునీత, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌కు తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని పాతర్లపల్లివద్ద చెట్టుకొమ్మ మీదపడి శివప్రసాద్ అనే టెక్నికల్ అసిస్టెంట్ తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే ఉపాధిహామీ పథకంలో రొద్దం మండల కేంద్రంలోని బొక్సంపల్లిలో టెక్నికల్ అసిస్టెంట్ శివప్రసాద్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం బొక్సంపల్లిలో పనిముగించుకుని రొద్దం బయలుదేరి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా పాతర్లపల్లివద్దకు రాగానే చెట్టుకొమ్మ విరిగి మీదపడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

న్యూస్ బాక్స్

20 నుంచి సమ్మె.. ఆశాల నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

పెనుకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు పీహెచ్‌సీ వైద్యురాలు రిహానాకు సమ్మె నోటీసును ఆశవర్కర్లు అందజేశారు. మంగళవారం సీఐటీయూ నాయకులు బాబావలి, నాగరాజు, రాజేశ్వరి, అలివేలమ్మ తదితరులు సమ్మె నోటీసును అందజేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని ఒప్పంద జీవో విడుదల చేయాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని పేర్కొన్నారు. లేబర్‌కోడ్ రద్దుచేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకులు తులసి, లలిత, గౌతమి, ఆనందీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ ఎన్నిక



ఎన్నికైన కమిటీతో ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం గురునాథ్‌సర్కిల్‌లో ఉండే ఆటోడ్రైవర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐటీయుసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, గౌరవాధ్యక్షులు వేమయ్యయాదవ్ హాజరై కమిటీ అధ్యక్షుడిగా లేపాక్షి షబ్బీర్, కార్యదర్శిగా రఫీక్, కోశాధికారిగా హిందూపురానికి చెందిన షబ్బీర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, అక్రం, ముబారక్, చిలమత్తూరు శెక్షాలను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా రహమతుల్లా, జహీర్, సాదిక్, కమిటీ మెంబర్లు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారుతిరెడ్డి, జబీవుల్లా, చలపతి, సమీవుల్లా, నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురి బైండోవర్



తహసీల్దార్ ఎదుట అక్రమ మద్యం అమ్మకందారులు

అగళి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం మద్యం అమ్ముతుండగా ఎక్సైజ్ సిబ్బంది కెన్యానాయక్, అనిల్‌కుమార్ దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. వన్నేష్, రంగస్వామి, హనుమంతరాయ, నాగరాజు, రంగనాథ్, ఆషారాణి, హనుమంతరాయను తహసీల్దార్ సుబ్బారావు ముందు హాజరుపరిచారు. వారిని బైండోవర్ చేసి రూ.లక్ష పూచీకత్తుతో విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం అమ్మితే జైలుకు పంపుతామని హెచ్చరించారు.

14 నెలలుగా అందని వేతనాలు

ఇబ్బందుల్లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫాం కార్మికులు

మడకశిర రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫాంలో పనిచేస్తున్న సిబ్బందికి 14 నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగులో పుట్టపర్తి జిల్లాలో మోడల్ మండలంగా మడకశిర నియోజకవర్గాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. నియోజకవర్గంలో మడకశిర, అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల మండలాల్లో 16 యూనిట్లుగా విభజించారు. అందులో 168 సిబ్బంది పనిచేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా సిబ్బంది ఇక్కడకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. 14 నెలలుగా వేతనాలు అందక వారు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తమకు వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై డివిజన్ ఇన్‌చార్జి రమేష్ మాట్లాడుతూ సిబ్బందికి 14 నెలల వేతనాలు రావాలని, త్వరలోనే వారి ఖాతాల్లోకి వేతనాలు జమవుతాయన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తే చర్యలు: సీఐ



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మడకశిర రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని సీఐలు నాగేష్ బాబు, రాజ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో మంగళవారం కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగేష్‌బాబు మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం, నాటుసారా, గ్యాంబ్లింగ్, మట్కాలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

డిగ్రీలో 81.25 శాతం ఉత్తీర్ణత

పెనుకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వెలువడిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో 81.25శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వైస్ ప్రిన్సిపాల్ జయప్ప తెలిపారు. మొత్తం 80మంది విద్యార్థులకుగాను 65మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం తక్షణం కులగణన చేపట్టాలి

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మడకశిర, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఒత్తిడి కారణంగానే కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కులగణనకు సమ్మతించిందని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలంలోని నీలకంఠాపురంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండు చేశారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో యూపీఏ జనాభా గణనతో పాటు కులగణన మీద సర్వే చేసిందని అన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ నివేదికను విడుదల చేయలేదని అన్నారు. కులగణను చేపట్టాలని కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో, పార్లమెంటులో లేవనెత్తారని అన్నారు. కులగణన కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయమని అన్నారు. దేశంలో ప్రైవేటు విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని, ఆ దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలని యూపీఏ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసిందని, దానిని ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించాలని అన్నారు. తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లను అమలు అవుతున్నాయి, మిగిలిన రాష్ట్రాల్లో 50 శాతమే అమలవుతున్నాయని అన్నారు. ముందు నుంచి భారతీయ జనతా పార్టీ రిజర్వేషన్‌లకు వ్యతిరేకమని ఆరోపించారు.

మహిళాకాశం యాప్ ఉపయోగకరం

మున్సిపల్ చైర్మన్ రమేష్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల కోసం తీసుకొచ్చిన మహిళాకాశం యాప్ ఎంతో ఉపయోగపడుతుందని మునిసిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో యాప్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలు హాజరుకావాలని, పొదుపు, రుణం, జీవనోపాదుల వివరాలు సంఘంలోని రిక్వెస్ట్, ఎడిట్ ఆప్షన్లు తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ యాప్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే సంఘాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు వీలుంటుందన్నారు. ఈ యాప్ సులభతరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీవనోపాదుల జిల్లా అధికారి వాసుదేవరెడ్డి, ఐబీ భవాని, బీఎంసీ గంగులయ్య, పీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు విజయలక్ష్మీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ ఉత్సవాలు

హిందూపురం, మే 6(ఆంధ్రజ్యోతి): సూరప్పకట్టకింద వెలసిన మధుగిరి మారెమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. మహిళలు బియ్యం పిండితో ప్రత్యేకంగా చేసిన జ్యోతులను ఇళ్ల నుంచి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ రమేష్, వాల్మీకి సంఘం అధ్యక్షులు వెంకటరమణప్ప, గౌరవాధ్యక్షులు ఆదినారాయణప్ప, రాయల్‌గోపాల్, ఆకుల సూరీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వార్డు, బూత్ కమిటీల ఏర్పాటు

పెనుకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ వార్డు, బూత్ కమిటీలను మంగళవారం ఎంపిక చేశారు. మండల కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో నగర పంచాయతీ పట్టణ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పెనుకొండ మునిసిపాలిటీకి చెందిన 20వార్డుల కమిటీలు, 24బూత్ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల నియమావళి గురించి వివరించారు. 1, 4, 5, 7, 8, 9, 10, 11, 12, 13వ వార్డులోని పది వార్డు కమిటీలు, బూత్‌కమిటీలను ఎన్నుకున్నారు. మిగిలిన వార్డులకు సంబంధించి రెండు రోజుల్లో పూర్తీచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు పూజలు



గుడిబండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి విశేష పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా లక్ష్మీదేవి ఊరేగింపు

గుడిబండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెఎన్‌పల్లి గ్రామంలో వెలసిన లక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

'మెడల్ ఆఫ్ హానర్' అభినందనీయం



మెడల్ ఆఫ్ హానర్ అందుకుంటున్న భువన్‌రిబు

పెనుకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థను స్థాపించి దేశ వ్యాప్తంగా బాలల హక్కుల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు భువన్‌రిబు వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ ద్వారా మెడల్‌ఆఫ్ హానర్ అందుకోవడం అభినందనీయమని సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థ భాగస్వామ్యంతో సమత స్వచ్ఛంద సంస్థ అన్నమయ్య, శ్రీసత్యసాయిజిల్లాల్లో పిల్లల రక్షణ, బాల్యవివాహాల నిర్మూలనపై పనిచేస్తుందన్నారు. వరల్డ్ వైడ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డెమోనికల్ రిపబ్లిక్‌లో మెడల్ అందుకోవడం హర్షనీయమన్నారు. ఈ అవార్డు అందుకున్న తొలిభారతీయుడు భువన్‌రిబు కావడం విశేషమన్నారు.

న్యాయాధికారికి సత్కారం

పెనుకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి నుంచి పెనుకొండ కోర్టుకు బదిలీపై వచ్చిన జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్‌ను స్థానిక బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మంగళవారం పెనుకొండకు వచ్చిన ఆయనను బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సీనియర్ సివిల్‌న్యాయాధికారి వాసుదేవన్, ప్రిన్సిపాల్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప, న్యాయవాదులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బార్‌అసోసియేషన్ కార్యాలయంలో నూతన న్యాయాధికారిని సత్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయాధికారి వాసుదేవన్ మాట్లాడుతూ కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి సహకరించాలన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేస్తూ కోర్టును అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, న్యాయవాదులు కురుబ అశ్వర్థనారాయణ, గొల్ల లక్ష్మీనారాయణ, శివశర్మ, నాగిరెడ్డి, జావిద్, గౌతమి, ప్రేమ, బాలాజీ, హరి పాల్గొన్నారు.